# స్పెయిన్,పోర్చుగల ట్రావెలాగ్



– మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**13-9-2015**

ఉదయం అలారం మోగకుండానే నాకు ఐదుం ముప్పావుకి మెలుకువ వచ్చింది. ముందు నేను స్నానం చేసి పద్మజని లేపితే తనూ తయారైంది. ఎనిమిదికి మేం బసచేసిన హోటల్ లుటేషియాలోని ఇన్‌ఫ్యూషన్ రెస్టారెంట్‌కి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్ళాం. యూరోపియన్స్ మాంసాహారులు కాబట్టి అక్కడ బాయిల్డ్ ఎగ్స్, హాఫ్ బాయిల్డ్ ఎగ్స్, ఆమ్లెట్స్, బీఫ్, పోర్క్ మొదలైనవి సమృద్ధిగా ఉంటాయి. శాకాహారం తక్కువ. ఆరెంజ్ జ్యూస్, కాఫీ, టీ, కర్బూజా ముక్కలు, బ్రెడ్, పంప్కిన్ జామ్ మాత్రమే మేం తినగలిగేవి ఉన్నాయి. ఎనిమిదిన్నరకే లాంజ్‌లో మా స్థానిక గైడ్ క్రిస్టీన్ వేచి ఉంది. దీపక్ ఆవిడని పరిచయం చేసి బయట ఆగివున్న మా కోచ్‌ని చూపిస్తే ఎక్కాం. తొమ్మిదింపావుకి కోచ్ బయలుదేరింది. దీపక్ ఆవిడని అందరికీ పరిచయం చేసాక చెప్పింది.



స్థానిక గైడ్ క్రిస్టీన్

"బోంద్రియా. అంటే పోర్చుగీస్ భాషలో గుడ్ మార్నింగ్. పోర్చుగల్‌ని ప్యూర్ట్‌గావ్ అంటాం. మీరున్న లిస్బన్‌ని మేము లిస్బోవా అంటాం. ఈ నగర జనాభా దాదాపు ఐదు లక్షలు. మాకు పబ్లిక్ మెట్రో ఉంది. సెప్టెంబర్, అక్టోబర్ లిస్బన్ హార్బర్ నించి చాలా క్రూజ్‌లు వెళ్తాయి. పోర్చుగీస్ ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడబడే ఐదో భాష. మాది కష్టమైన భాష. మేం పలికేలా ఆర్‌ని పలకడం కొత్తవారికి కష్టం 15-16 శతాబ్దాల్లో మేము ప్రపంచంలో కొత్త ప్రాంతాలని కనుక్కుని కాలనీలని ఏర్పరిచాం. ఇండియా, బ్రెజిల్, ఆఫ్రికాల్లో కొన్ని ప్రాంతాలు, మూడు ఖండాల్లో మాకు కాలనీలుగా ఉండేవి. నేడు రెండు ఖండాల్లో, అంటే యూరప్, ఆఫ్రికాల్లో నేడు మా సామ్రాజ్యం ఉంది. మీ ఇండియాలో గోవా, డయ్యు, డామన్ మా కాలనీలని మీకు తెలిసే ఉంటుంది."

"నైన్టీన్ సిక్స్టీ టు దాకానే. తర్వాత అది ఇండియాలో కలిసింది" ఒకరు చెప్పారు.


"ఫ్రాన్స్‌తో నెహ్రూ ఒడంబడిక చేసుకుని పుదుచ్చేరిని వెనక్కి తీసుకున్నట్లే గోవా, డయ్యు, డామన్ విషయంలో ఒడంబడిక చేసుకోవాలని ప్రయత్నించినా కుదరలేదు. ఆ నాటి పోర్చుగల్ నియంత సాలజర్ నాలుగు వందల ఎళ్ళకి పైగా తమ ఆధీనంలోని వాటిని వదులుకోదలచుకోలేదు. గోవా ప్రజలు స్వతంత్రం కోసం పోరాడుతూండేవారు.

అమెరికా కానీ, ఐక్యరాజ్యసమితి కానీ కిమ్మనలేదు. గోవా స్వాధీనం చేసుకోవడం లేదని నెహ్రూని వామపక్షాలు ఆ రోజుల్లో దుమ్మెత్తి పోసేవి. కాశ్మీర్, గోవా విషయాల్లో నెహ్రూ మెంటల్ మాస్టర్ బేషన్ చేసుకుంటున్నాదని, మదరిండియా పత్రిక సంపాదకుడు బాబూరావ్ పటేల్ ఎగతాళి చేసాడు. వామపక్ష పత్రిక బ్లిడ్జ్ సంపాదకుడు కూడా నెహ్రూ నోబుల్ పీస్ ప్రైజ్ ఆశించి సైనిక చర్యకి అయిష్టతని చూపిస్తున్నాడని ఆరోపించాడు. ఫ్రెంచ్ వాళ్ళు సౌమ్యంగా వెళ్ళారు కానీ, ఈ బుడతకీచుల్ని చివరకి నెహ్రూ సైనిక చర్యతో పారద్రోలాడు. 17 డిసెంబర్ 1962న తెల్లవారుఝామున గోవాని భారతసైన్యం సునాయాసంగా ఆక్రమించుకుంది. పోర్చుగల్ గోవాలో సైనిక స్థావరం పెట్టి ఉంటే నేటి కాశ్మీర్‌లా గోవా కూడా పెద్ద సమస్యయ్యేది.

చాలామందికి మోహన్ రెనడె గురించి తెలీదు. మన దేశానికి 15 ఆగస్ట్ 1947న వచ్చింది. ఆ తర్వాత కూడా ఆయన స్వతంత్ర పోరాటం చేసి, పద్నాలుగేళ్ళు జైల్లో ఉన్నాడు. మహారాష్ట్రలోని సాంగ్లీ అనే ఊళ్ళో జన్మించిన ఆయన గోవాలో టీచర్ ఉద్యోగం చేసేవాడు. ఇంకా గోవా పోర్చుగీస్ ఆధీనంలో ఉండటంతో గోవ విముక్తి కోసం ‘గోమాంతక్ ముక్తి సంఘటన్‘ అనే విప్లవ సంస్థని స్థాపించి, 50 సార్లు గెరిల్లా దాడులని నిర్వహించాడు. 25 అక్టోబర్ 1955న వెస్టిమ్ అనే పోలీస్ స్టేషన్ మీద దాడి చేసినప్పుడు వారి కాల్పుల్లో గాయపడి చిక్కాడు. 5 ఏళ్ళ విచారణ తర్వాత కూడా అతన్ని విడిచిపెట్టలేదు.

ఓ సందర్భంలో నాస్తికుడైన తమిళనాడు ముఖ్యమంత్రి అన్నాదొరై పోప్ జాన్ పాల్‌ని కలిసినప్పుడు, లిస్బన్ జైల్లోని మోహన్ రెనడె విడుదల విషయంలో కల్పించుకోమని ఓ విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చాడు. కారణం పోర్చుగల్ రోమన్ కేథలిక్స్ అధికం. ఆయన పోర్చుగల్ పాలకులతో మాట్లాడాక 14 సంవత్సరాల జైలు జీవితం తర్వాత విడుదలై బాంబేకి చేరుకున్నాడు. అక్కడి శివాజీ పార్క్‌లో ఆయన గౌరవార్థం జరిగిన సభలో ఆయన ‘భారత్ మాతకి జై‘ అని మాత్రమే మాట్లడాడు. పూణేలో స్థిరపడ్డాడు.

మోహన్ రెనడే అసలు పేరు మనోహర్ ఆప్టే. కానీ విప్లవోద్యమంలో పాల్గొంటున్నాడు కాబట్టి తన కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియకుండా తన పేరుని మోహన్ రెనడేగా మార్చుకున్నాడు. ప్రభుత్వం ఆ పేరు మీదే అతనికి పద్మశ్రీ బిరుదుని ఇచ్చి గౌరవించింది. ఇలాంటి వారి చరిత్రలు పాఠ్యపుస్తకాల్లో ఉండాలి. కానీ ఉండవు.


మాన్యుమెంట్ ఆఫ్ ధి డిస్కవరీస్

లిస్బన్ రోడ్లు చిన్న రోడ్లైనా కార్లు పార్కింగ్ స్పేస్‌లోనే పార్క్ చేయడం, మనుషులు నడిచేందుకు పేవ్‌మెంట్స్ ఉండటంతో ట్రాఫిక్‌కి అంతరాయం కలగకపోవడం, గమనించాను. రోడ్‌కి అటు, ఇటు చెట్లు, గ్రీనరీ, పార్క్‌ల్లో పైన్ చెట్లు కనబడ్డాయి. ఎడమవైపు పసుపు పచ్చ బిల్డింగ్‌లో స్పెయిన్ ఎంబసీ కనిపించింది. క్రిస్టీన్ ఇండియన్ ఎంబసీని, దాని ముందున్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని కిటికీలోంచి చూపించింది. చెట్ల మధ్య కొల్లాయి కట్టుకుని చేతిలో కర్రగల గాంధీ విగ్రహాన్ని చూసి, మనకి తెలిసిన ఒకరు కనపడ్డారు అనుకున్నాను. ఉదయం 9.40కి మా మొదటి స్పాట్ టాగస్ నది ఉత్తర ఒడ్డున గల మాన్యుమెంట్ ఆఫ్ ది డిస్కవరీస్ బస్ బేలో మా బస్ ఆగింది. అక్కడ చాలా వందల చేపల పడవలు, తినుబండారాల దుకాణాలు, టూరిస్ట్‌లతో కోలాహలంగా ఉంది. క్రిస్టిన్ చెప్పసాగింది.

"పదిహేనో శతాబ్దంలో మా దేశం నించి ఇతర ప్రాంతాలకి వెళ్ళి వ్యాపారం చేయాలని, కొత్త ప్రాంతాలని కనిపెట్టాలని భావించేవారు. వర్తకులు ఇండియాకి వెళ్ళి సుగంధద్రవ్య వ్యాపారం చేయాలనుకున్నా భూమార్గ మార్గాలన్నీ పర్షియన్స్ ఆధీనంలో ఉండటంతో సముద్ర మార్గం కనిపెట్టాలని ప్రయత్నం చేసారు. ఇది టాగస్ నది ఉత్తర తీరం. ఇక్కడనించే మా ఓడలు బయలుదేరాయి. దాన్ని ఏజ్ ఆఫ్ డిస్కవరీగా పేర్కొంటాం. మా భాషలో కేరవెల్లా అంటే ఓడ. వాస్కో డ గామా, ఎస్టాడో నోవో రెజిమి ఆఫ్ ఆంటానియో ద ఒలీవియర్ తలజార్, ఇంకా ఇతర నావికులతోపాటు జువాలజిస్ట్‌లు, బొటానిస్ట్‌లు, రచయితలు సముద్రప్రయాణం చేసి కొత్త ఖండాలని, అక్కడి కొత్త జంతువులని, చెట్లని చివరికి ఇండియాని కనుగొన్నారు. ఏజ్ ఆఫ్ డిస్కవరీ గుర్తుగా ఇక్కడ మాన్యుమెంట్ ఆఫ్ ది డిస్కవరీస్‌ని నిర్మించాలని 1939లో ఆలోచన వచ్చింది. జూన్ 1940లో జరిగిన పోర్చుగీస్ వరల్డ్ ఎగ్జిబిషన్‌లో తాత్కాలిక బీకన్‌ని నిర్మించారు. ఇన్‌ఫాంటీ హెన్రీ అనే నావికుడి 500వ వర్ధంతి సందర్భంగా నవంబర్ 1958న మొదలుపెట్టి జనవరి 1960 కల్లా, సిమెంట్‌తో గులాబీరంగు రాళ్ళతో 171 అడుగుల ఎత్తున నిర్మించిన స్లాబ్ మీద ఇరువైపులా లైమ్ స్టోన్ మీద చెక్కిన 33 విగ్రహాలని అమర్చారు. అటు, ఇటు రేంప్స్ కూడా ఉన్నాయి. చేతిలో ఓ పడవ మోడల్‌ని పట్టుకున్న హెన్రీ ది నేవిగేటర్ విగ్రహం మొదటిది. ఆల్ఫాన్సో ది ఫిఫ్త్ పోర్చుగల్, ఇండియాకి సముద్రమార్గం కనిపెట్టిన వాస్కో డ గామా, బ్రెజిల్‌ని కనిపెట్టిన పెడ్రో ఆల్వారెస్ క్రెబెల్, మొదటిసారి భూభ్రమణం చేసిన ఫెర్డినాండ్ మగలెన్, కాంగొ రివర్‌ని తొలిసారిగా చేరుకున్న డియోగో కేవో, క్రిస్టియన్ మిషనరీ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ మొదలైన వారి విగ్రహాలు వీటిలో ఉన్నాయి. ఈ విగ్రహాల్లో నావికులే కాక చక్రవర్తులు, మేప్‌లని తయారు చేసే నిపుణులు, కళాకారులు, శాస్త్రజ్ఞులు, మిషనరీస్ ఉన్నారు. ప్రతీ విగ్రహం ముందుకి కదులుతున్నట్లు ఉంది. పక్కనే నేలమీది తెలుపు, నలుపు రాళ్ళు సముద్రకెరటాలని గుర్తు తెచ్చేలా పరిచారు. ఆ రోజుల్లోని ఓడాకారంలో దీన్ని నిర్మించారు.

ఈ మాన్యుమెంట్ మొదటి అంతస్థులో 101 మంది పట్టే, 190 చదరపు అడుగుల స్టేజ్‌గల ఆడిటోరియం ఉంది.




దీనికి ప్రొజెక్టర్ కూడా ఉంది. రెండో అంతస్థులో రెండు ఎగ్జిబిషన్ హాల్స్ ఉన్నాయి. మూడో అంతస్థులో నాలుగు గదులున్నాయి. సాధారణంగా - డిటోరియంలో లిస్బన్ చరిత్ర మల్టీమీడియా ఎగ్జిబిషన్ ప్రదర్శన జరుగుతూంటుంది. మిగిలిన ప్రాంతమంతా ఎగ్జిబిషన్‌కి ఉపయోగిస్తారు. ఈ మాన్యుమెంట్ పైకి లిఫ్ట్, మెట్లు ఉన్నాయి. అక్కడ నించి టాగస్ నది, ఏజ్ ఆఫ్ డిస్కవరీ నించి ఉన్న బెలేం టవర్, జెరోనిమో మొనాస్ట్రీ మొదలైనవి చూడచ్చు. కానీ మాకిచ్చిన సమయం చాలక మేము వాటిలోకి వెళ్ళలేదు. ఈ మాన్యుమెంట్‌కి రెండు వైపులా ఇనప గ్లోబ్స్ ఉన్నాయి.

నేలమీద ఆనాటి వరల్డ్ మేప్‌లో పోర్చుగీస్ ఆక్రమించుకున్న ప్రాంతాలు గుర్తించబడ్డాయి. అందులో ఇండియాలోని కేలికట్ (1498), గోవా, డయ్యు, డామన్ (1509) ఇంకా సిలోన్ (1505) కనిపించాయి. ఆ మేప్‌లో ఏజ్ ఆఫ్ డిస్కవరీ కాలంలోని పోర్చుగీస్ నావికుల ఓడల దారులు కూడా చూపబడ్డాయి. డిస్కవరీ మాన్యుమెంట్‌కి ఎడమవైపు ఓ ఫలకం మీద పోర్చుగీస్ భాషలో 'టు ప్రిన్స్ హెన్రీ అండ్ ది పోర్చుగోస్ దట్ డిస్కవర్డ్ ది రోడ్స్ ఆఫ్ ది సీ' అని చెక్కి ఉంది. ఆ వాక్యాల కింద ఓ ఇనప లంగరు అమర్చి ఉంది. కుడివైపు

ఫలకం మీద 'ఆన్ ది ఫిఫ్త్ సెంటినరీ ఆఫ్ ప్రిన్స్ హెన్రీ 1460 -1960' అని చెక్కి, కింద పుష్పగుచ్ఛం ఉంది. ఈ మాన్యుమెంట్ ముందున్న స్క్వేర్‌లోని 160 అడుగుల దిక్సూచి సౌత్ ఆఫ్రికన్ ప్రభుత్వం బహుమతి. మాన్యుమెంట్ ఆఫ్ డిస్కవరీస్ దగ్గర అంతా ఫోటోలు తీసుకున్నాక బయలుదేరాం.

మాన్యుమెంట్‌కి సమీపంలో ఐదు యూరోలకి చేత్తో గీసిన చిత్రాలని అమ్ముతున్నారు. అవన్నీ చారిత్రాత్మక కట్టడాల చిత్రాలే.

అక్కడ తినుబండారాల స్టాల్స్ చాలా ఉన్నాయి. ఓ వైపు వందలకొద్దీ చిన్న చేపల పడవలు ఉన్నాయి. ఫుడ్ కోర్ట్ బయట నిలువెత్తు ఐస్క్రీం బొమ్మ ఉంది. ఎక్కువగా అనేక రకాల చేపల స్టాల్స్ ఉన్నాయి. బేక్డ్, గ్రిల్డ్ చేపలు, స్కిడ్‌లాంటి జలచరాల మాంసం అమ్ముతున్నారు. మొక్కజొన్న కండెలు కాల్చి అమ్ముతున్నారు. ఒకోటి యూరో. నాకు అదిష్టం కాబట్టి ఓ కండె కొనుక్కుని తిన్నాను.

9.40కి అంతా బస్ పార్క్‌కి వెళ్ళి బస్ ఎక్కాం. పావుగంటలో ఏడు కిలోమీటర్ల దూరంలోని జెరోనిమో మొనాస్ట్రీకి చేరుకున్నాం. లోపలికి వెళ్ళబోయే ముందు క్రిస్టిన్ చెప్పింది.

"మగవాళ్ళు టోపీలు తీసెయ్యాలి. ఆడవాళ్ళకి ఆ అవసరం లేదు. ప్రతీ ప్రార్థనా స్థలంలో లాగా ఇక్కడా నిశ్శబ్దంగా ఉండాలి."

బయట రెండు తలుపుల మధ్య ఉన్న హెన్రీ ది నేవిగేటర్ విగ్రహం చూపించి చెప్పింది.

"ఇది ఏజ్ ఆఫ్ డిస్కవరీ కాలంలో పోర్చుగల్ సంపద, అధికారానికి చిహ్నంగా ఉండేది."

మొనాస్ట్రీ, బెలం టవర్ కలిసి ఎంట్రన్స్ టికెట్ పదమూడు యూరోలు. 14 ఏళ్ళలోపు వారికి ఉచితం. అందరికీ హెడ్ ఫోన్స్ ఇచ్చి అన్నీ పని చేస్తున్నాయని రూఢీ చేసుకున్నాక ఆమెని అనుసరించాం. మొనాస్ట్రీలోకి అడుగు పెట్టాక ఆడియో మొదలైంది. గైడ్ చెప్పింది.

"ఇది సెయింట్ జెరొమీకి అంకితమివ్వబడింది. ఇక్కడ గతంలో ప్రిన్స్ హెన్రీ ది నేవిగేటర్ నిర్మించిన శాంటా మారియా అనే ఓ చర్చ్ ఉండేది. 1497లో ఇండియాని కనుగొనడానికి సముద్రయానం చేసే ముందు రాత్రి వాస్కో డ గామా ఈ చర్చ్‌లో ప్రార్థనలు చేసాడు. వాస్కో డ గామా ఇండియాని కనుక్కున్నాక వర్జిన్ మేరీకి కృతజ్ఞతలు చెప్పడానికి ఆ చర్చ్ స్థానంలో దీన్ని నిర్మించారు. రెండంతస్థుల ఈ జెరోనిమో మొనాస్ట్రీని లియోజ్ రాతితో కట్టారు. ఎత్తు 105 అడుగుల




ఎత్తు, 39 అడుగులు వెడల్పు ఉంది. చెక్కిన విగ్రహాలు బయట షెల్ఫుల్లో (నిచెస్) ఉన్నాయి. 6 జనవరి 1501న జెరోనిమో మొనాస్ట్రీ నిర్మాణం ఆరంభమై, వందేళ్ళ తర్వాత పూర్తైంది. దీనికి డబ్బుని కింగ్ మేన్యుయెల్ -1 ఆఫ్రికా, ఓరియెంట్ దేశాల వ్యాపారంలో తెచ్చిన మిరియాలు, లవంగాలు, దాల్చిన చెక్క మీద విధించిన 5శాతం వాణిజ్య పన్నుతో నిర్మించాడు. దీని నిర్మాణ ఆర్కిటెక్చర్‌కి మేన్యువల్ ఆర్కిటెక్చర్ అని పేరు. వెల్లకిలా పడుకుని పైకి నమస్కరించే వాస్కో డ గామా విగ్రహం గల ఆయన సమాధి ఇక్కడే ఎంట్రన్స్‌లో చూడచ్చు. ఇండియానే కాక ఇతను ఆఫ్రికన్ ఖండాన్ని కూడా సందర్శించాడు. ఈయన పుట్టిన సంవత్సరం స్పష్టంగా

తెలీదు. 24 డిసెంబర్ 1524న పోర్చుగల్ ఇండియాలోని కొచ్చిన్‌లో మరణించాడు. తర్వాత వాస్కో డ గామా మృతదేహాన్ని ఇక్కడికి తరలించారు. రాజుల సమాధుల మీద సింహాల బొమ్మలని వారి అధికార చిహ్నంగా చెక్కారు. ఇక్కడ రాజులవే కాక వివిపిల సమాధులుకూడా ఉన్నాయి.

"షేక్స్‌పియర్‌తో పోల్చే పోర్చుగల్ రచయిత లూయిస్ ది కమోయిస్, పోర్చుగీస్ చరిత్రలోని కింగ్ మేన్యువల్, కింగ్ సెబాస్టియానో లాంటి చక్రవర్తులు, రాణులు, ఇతర గొప్పవారి సమాధులు కూడా ఇక్కడ ఉన్నాయి. ఈ మొనాస్ట్రీలో ఆర్డర్ ఆఫ్ సెయింట్ జెరోమీ ఉండేవారు. నావికులకి సహాయం చేయడం, రాజుల ఆత్మలకోసం ప్రార్ధన చేయడం వారి పని."

అంతా తిరిగి చూసాం. ఎత్తయిన సీలింగ్‌తో ఈ మొనాస్టరీ విశాలంగా ఉంది. ఇక్కడి కొన్ని విగ్రహాలకి వంకుల జుట్టు ఉంది. ప్రతీ స్థంభం మీద నావికులు ఉపయోగించే తాళ్ళ ముడులని, సముద్రపు రాక్షసులు, పగడాలు, ఇంకా ఇతర సముద్రానికి చెందినవాటిని, తొండలు, సింహాలు, ఏనుగులు, పాములులాంటి పోర్చుగల్‌లో లేని జంతువుల బొమ్మలని చెక్కారు. బైబిల్‌లోని జోసెఫ్ కథని గోడల మీద చెక్కారు.

"28 డిసెంబర్ 1833లో దీని యజమానిత్వం రియల్ కాసా పియా ద లిస్బోయా అనే దాతృత్వ సంస్థకి బదిలీ చేయబడింది. లిస్బన్‌లోని ఈ మోనాస్ట్రీ గోథిక్, మేన్యువలైన్ ఆర్కిటెక్చర్‌కి ప్రసిద్ధ ఉదాహరణ. 1963లో దీన్ని, సమీపంలోని బెలేం టవర్‌ని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. అందులోని మాంక్స్ నావికుల భద్రతకి ప్రార్ధనా సహాయాన్ని అందించేవారు" క్రిస్టీన్ చెప్పింది.

హెడ్‌ఫోన్స్‌ని తిరిగి ఇవ్వక్కర్లేదు కానీ దీపక్ కాని, క్రిస్టిన్ కాని చెప్పకపోవడంతో వాటిని ఓ చోట ఉంచి అంతా ఆమె వెంట బయటకి నడిచాం. బయట 1940లో నిర్మించిన తోట ఉంది. అందులో మునిసిపల్ కోర్ట్స్ ఆఫ్ ఆర్మ్స్ ఆఫ్ పోర్చుగల్ ఆకారంలో పొదలని కట్ చేసారు. మధ్యలో పెద్ద ఫౌంటెన్ ఉంది. ప్రత్యేక సందర్భాల్లో వీటి దగ్గర రంగురంగుల లైట్లు వెలిగిస్తారు. ఈ తోట పక్కనే 16వ శతాబ్దపు ఇళ్ళున్నాయి. అందులో బయట సీటింగ్ గల రెస్టారెంట్స్ నడుస్తున్నాయి.

అక్కడ నించి కోచ్‌లో ఇరవై నిమిషాల దూరంలోని లిస్బన్ కేథడ్రల్‌కి చేరుకున్నాం. పాత లిస్బన్ వీధులు ఎత్తుపల్లాలుగా ఉండటంతో డ్రైవింగ్ కష్టం.

"పోర్చ్‌గీస్‌లో చర్చ్‌ని ఇగ్రేజా అంటాం. నా వెంట రండి." క్రిస్టిన్ బస్ దిగుతూ చెప్పింది.

అటు, ఇటు బురుజుల్లాంటివి ఉండటంతో ఇది బయటకి చూడటానికి కోటలా కనిపించింది. పొడవు 300 అడుగులు, వెడల్పు 130 అడుగులు, ఎత్తు 39 అడుగులు. ఆ రోజు ఆదివారం కాబట్టి చాలా పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. చర్చ్ బయట పెళ్ళైన నూతన వధూవరులు కారు ఎక్కుతూ కనిపించారు.

"అరబ్‌ల నించి తిరిగి ఇంగ్లీష్ క్రుసెడర్స్ సహాయంతో లిస్బన్‌ని గెలుచుకున్నాక 1147లో ఈ చర్చ్‌ని నిర్మించారు. ఇది ఇక్కడి అతి పురాతన చర్చ్. 14-16 శతాబ్దాల మధ్య లిస్బన్‌లో చాలా భూకంపాలు వచ్చాయి. ఈ రోమన్ కేథలిక్ కెథడ్రల్ వాటిని తట్టుకుంది. 1755లో వచ్చిన ఘోరమైన భూకంపానికి ఇది చాలా దెబ్బతింది. అనేకసార్లు దీన్ని రెనొవేట్ చేసారు. అందువల్ల అనేక ఆర్కిటెక్చరల్ స్టైల్స్ కలిసి ఉంది. 1910 నించి ఇది నేషనల్ మాన్యుమెంట్‌గా గుర్తించబడింది. ఇటీవల ఇక్కడ జరిపిన పురావస్తు తవ్వకాల్లో రోమన్ వీధులు, దుకాణాలు, రోమన్ వంటగది, డ్రెయినేజ్ సిస్టం మొదలైనవి బయటపడ్డాయి. ఇక్కడ మూర్స్ (అరబ్బులు) ఒకప్పుడు ఉన్న సూచనగా ఎర్రగోడలు గల మసీదు కూడా పురావస్తు తవ్వకాల్లో బయటపడింది. ఇందులో కూడా సమాధులు ఉన్నాయి." క్రిస్టిన్ చెప్పింది.


లిస్బన్ కెథడ్రిల్

అనేక ఫ్రెస్కోలు గల ఎత్తైన ఈ చర్చ్ లోపల చాలా వైభవంగా ఉంది. నిజానికి యూరప్‌లోని పేలస్‌లు, చర్చ్‌లు, కేథడ్రిల్స్ అన్నీ ఎంతో వైభవంగా ఉంటాయి. చర్చ్‌లో 17వ శతాబ్దపు టైల్స్‌తో క్రీస్ట్ శిష్యుల బొమ్మలు అమర్చి ఉన్నాయి. చాలా ఎత్తైన సీలింగ్. కిటికీలకి రంగురంగుల స్టెయిన్డ్ గ్లాస్‌లు ఉన్నాయి. ఇక్కడ నైట్ (వీరుడు) లోపో ఫెర్నాండేస్ పచకో సమాధి కూడా ఉంది.

అక్కడినించి మా కోచ్‌లో క్రూజ్‌లు ఆరంభమయ్యే టాగస్ తీరానికి 11.30కి చేరుకున్నాము. ఏప్రిల్ ఫస్ట్ నించి 31 అక్టోబర్ దాకా స్థానిక క్రూజ్‌లు ఇక్కడ నించి ఆరంభమై, లిస్బన్ నగరం చూడటానికి బయలుదేరతాయి. రోజుకి మూడు క్రూజ్‌లు. ఉదయం 11.15, 11.40, సాయంత్రం 4.30కి మూడు టూర్లు ఉంటాయి. ట్రిప్‌కి 12.75 యూరోలు. మేం చేరుకునేసరికి పదకొండుంపావు క్రూజ్ వెళ్ళిపోయింది. అక్కడనించి వాస్కో డ గామా బ్రిడ్జ్ కనపడుతోంది.

వాస్కో డ గామా బ్రిడ్జ్: 25 ద ఏప్రిల్ బ్రిడ్జ్ మీద రద్దీ పెరగడంతో ఇంకో బ్రిడ్జ్ అవసరం ఏర్పడి టాగస్ నది మీద దీన్ని ఫిబ్రవరి 1995లో ఆరంభించి 1998లో లిస్బన్‌లో జరిగిన ఎక్స్‌పో 98 ఆరంభసమయానికి, మూడేళ్ళల్లో నిర్మాణం పూర్తిచేసారు. 25 మార్చ్ 1998లో దీన్ని ఆవిష్కరించారు. వాస్కో డ గామా ఇండియాకి సముద్ర మార్గాన్ని కనుగొన్న 500వ సంవత్సరం గుర్తుగా ఈ వరల్డ్ ఫెయిర్‌ని జరిపారు. ఇది యూరప్‌లోని అతి పొడవైన బ్రిడ్జ్ ఆరు లేన్స్ గల దీనిమీద హైవే మీదలానే 120 కిలోమీటర్ల వేగ పరిమితితో ప్రయాణించవచ్చు. వర్షం, పొగమంచు సమయంలో ఆ పరిమితి 90 కిలోమీటర్ల వేగమే. 312 అడుగుల లోతున పునాదిని తీసిన ఈ బ్రిడ్జ్ జీవితకాలం 120 ఏళ్ళు. లిస్బన్‌కి ఉత్తరం నించి ఈ బ్రిడ్జ్ మీదికి వచ్చే ట్రాఫిక్ టోల్ ఫీజ్‌ని చెల్లించాలి. కానీ దక్షిణం వైపు ట్రాఫిక్‌కి అది లేదు. దీని పొడవు 12 కిలోమీటర్ల 350 మీటర్లు. వెడల్పు 98 అడుగులు. పైలాన్ ఎత్తు 486 అడుగులు. 4.5 రిక్టర్ స్కేల్ భూకంపం, ఇంకా 155 కిలోమీటర్ల వేగంతో వీచే గాలి తాకిడిని ఈ బ్రిడ్జ్ తట్టుకునేలా డిజైన్ చేసారు.

11.50కి బయలుదేరిన తర్వాతి బోటులో ఎక్కాం. దాదాపు రెండువందల ఏభైమంది పట్టే దీనికి పై డెక్ కూడా ఉంది. క్రూజ్‌లోంచి లిస్బన్ నగరం చూపించారు. స్పీకర్లో చెప్పింది సరిగ్గా వినపడలేదు. లిస్బన్ నగరంలోని ఇందాక మేం చూసిన కెథడ్రిల్ లాంటి అనేక ప్రాచీన కట్టడాలు కనిపించాయి.

"పబ్లిక్ బాత్‌రూంకి అర యూరో చెల్లించాలి. యంత్రంలో 1, 5, 10 నాణాలు వేస్తే చిల్లర వస్తుంది. అవసరం ఉన్నవారు ఇక్కడే ఆ పని చూసుకోండి" దీపక్ దిగబోయే ముందు చెప్పాడు.

12.10కి పడవలోంచి దిగి సమీపంలో డౌన్ టౌన్‌లోని రోసియో (ఇంగ్లీష్‌లో కామన్స్) స్క్వేర్‌కి దాదాపు పావుగంట నడిచి చేరుకున్నాం. అది చాలా పెద్ద, స్క్వేర్. లిస్బన్ పాలకుడు పెడ్రో - 4 ముద్దు పేరు రోసియో. కాబట్టి ఈ పేరు

వచ్చింది. ఇది లిస్బన్‌లోని 13, 13 శతాబ్దాల నించి ఉన్న పురాతన మెయిన్ స్క్వేర్‌లలో ఒకటి. తిరుగుబాట్లు, ఉత్సవాలు, మరణశిక్షలు, బుల్ ఫైట్స్ ఇక్కడ జరిగేవి. నేడు స్థానిక లిస్బన్స్, పర్యాటకులు సందర్శించే స్క్వేర్ ఇది. ఇక్కడ వేసవిలో కాన్సర్ట్స్ జరుగుతాయి. ఇక్కడే సెంట్రల్ రైల్వే స్టేషన్ ఉంది. ఇక్కడి దుకాణాలు, రెస్టొరెంట్లు 18వ శతాబ్దానికి చెందినవి. కేఫేని కొలాకి పోర్చుగీస్ పొయెట్ మేన్యువల్ మరియు బార్బోసా దు బుకాజీ మిత్రులని కలవడానికి వస్తూండేవాడు. 1922 నించి ఉన్న ఆల్కహాల్ షాప్స్ ఎక్కువ. పబ్లిక్ గార్డెన్ ఒకటి సమీపంలో ఉంది. అంతా కాలినడకన తిరిగి చూసాం.

"ఈ పూట భోజనం మీ ఐటనరీలో లేదు. నటరాజ్ తందూరి రెస్టొరెంట్‌కి తీసుకెళ్తాను. అక్కడ ఇండియన్ భోజనం దొరుకుతుంది. లేదా మీరు ఇంకే రెస్టొరెంట్‌కైనా వెళ్ళచ్చు. ఇప్పుడు రెండైంది. మీ గడియారంలో చిన్న ముల్లు రెండు మీద ఉందో లేదో చూసుకోండి. 3.15కి మళ్ళీ ఇక్కడ కలుద్దాం. లేదా పియర్‌లో కలవండి. పడవెక్కి బయలుదేరిన చోటికి చేరుకుంటాం. మన కోచ్ అక్కడ మన కోసం ఎదురు చూస్తోంది" దీపక్ చెప్పాడు.

రోసియో స్క్వేర్‌లోని ఆ ఇండియన్ రెస్టొరెంట్‌కి కొందరే వచ్చారు. లిస్బన్‌లో మరో నాలుగు చోట్ల దీని బ్రాంచెస్ ఉన్నాయని బ్రోషర్‌ని చూసి తెలుసుకున్నాను. ఉదయం 12 నించి మధ్యాహ్నం 3 దాకా లంచ్, డిన్నర్ రాత్రి ఆరున్నర నించి పదకొండున్నర దాకా. మెన్యూ చూసి చెరో వెజ్ బిర్యానీ (6.50 యూరోలు)తో కడుపు నిండింది. వాటర్ బాటిల్ 1.50 యూరోలు. బిల్ పధ్నాలుగు యూరోలైతే టిప్ పది శాతం కలిపి పదహారు యూరోలు చెల్లించాను. మెన్యూలో 252 ఐటమ్స్ ఉన్నాయి. ప్లెయిన్ రైస్ ఒకటిన్నర యూరోలు. మాంసాహారాల ధరలన్నీ 8-11 యూరోల మధ్య ఉన్నాయి. మూడుం పావుకి ఒకరు రాలేదు. వారి కోసం వేచి చూద్దామని దీపక్ చెప్తే, 'నో రూల్స్ ఆర్ రూల్స్' అని ఎవరో అరిచారు.

ఐదు నిమిషాలు ఎదురు చూసి పియర్‌కి చేరుకుంటే అక్కడ వాళ్ళున్నారు. నాలుగన్నర పడవలో మళ్ళీ బయలుదేరిన చోటికి చేరుకున్నాం. మా కోచ్ డ్రైవర్ స్నానం చేసి బట్టలు మార్చుకుని ఉన్నాడు. కోచ్ ఎక్కి బెలెం టవర్‌కి బయలుదేరాం. టోగస్ నది నీరు, పోర్ట్ చాలా శుభ్రంగా ఉన్నాయి. (ఇక్కడో చిన్న విషయం చెప్తాను. హైదరాబాద్‌లోని శిల్పారామంలో బోటింగ్‌కి అర ఎకరం సరస్సు ఉంది. ఇటీవల వెళ్తే అది మురుగు పేరుకుని పైన తెట్టలు కనిపించింది. చుట్టుపక్కల వీధి కుక్కలు అరడజను పైనే కనిపించాయి. ఇలాంటి హైదరాబాద్‌ని విశ్వనగరం అనడం గొప్ప పాపం. విదేశాల్లో ఎక్కడా ఇంతదాకా పాచిపట్టిన, చెత్త వేసిన నీటిని నేను చూడలేదు)

ఓ చోట బస్ దిగి బెలెం టవర్‌కి నడిచి చేరుకున్నాం. దారిలో సుల్తాన్ బజార్ లాంటి షాప్స్ గల సన్నటి రోడ్ ఉంది. వీధి మధ్యలో డివైడర్‌గా చెట్లని అందంగా ఒకే వరసలో నాటారు. అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో ఆరేసిన బట్టలు కనిపించాయి. అమెరికాలో ఇది నిషిద్ధం. ఐదుం ముప్పావుకి బెలెం టవర్‌కి చేరుకున్నాక దాని గురించి క్రిస్టిన్ వివరించింది.

"పోర్చుగీస్‌లో టవర్‌ని టోహీ అంటాం. దీన్ని 1515లో లిస్బన్ నగర రక్షణగా నిర్మించిన కోటకి ఎంట్రన్స్‌గా మేన్యువైల్ స్టైల్‌లో నిర్మించారు. చాలా సముద్రయానాలు ఇక్కడ నించే ఆరంభమయ్యేవి. వాస్కో డ గామా లాంటి నావికులు తమ మాతృభూమి మీద చూసిన ఆఖరి దృశ్యం ఈ టవరే. ఏజాఫ్ డిస్కవరీ సమయంలో ఇది పోర్చుగల్‌కి గొప్ప చిహ్నంగా ఉండేది. దీని మీద కూడా సెయింట్ విన్సెంట్, విదేశీ జంతువు రైనో మొదలైన శిల్పాలు చెక్కారు. 98 అడుగుల ఎత్తు, 39 అడుగుల వెడల్పు గల దీన్ని లైట్ హౌస్‌గా కూడా ఉపయోగించారు. యునెస్కో దీన్ని వరల్డ్ హెరిటేజ్ మాన్యుమెంట్‌గా గుర్తించింది. నేడు దీన్ని కస్టమ్స్ సెంటర్‌గా ఉపయోగిస్తున్నారు. గుండ్రంగా మలుపులు తిరిగే దీన్లో ఐదు అంతస్థులున్నాయి. కొన్ని ఆసక్తికరమైన శిల్పాలు, పాత ఫిరంగులు, నావికులని రక్షించే అవర్ లేడీ ఆఫ్ సేఫ్ హోం కమింగ్ అనే విగ్రహం కూడా ఇందులో ఉంది."

మేం తిరిగి బస్ దగ్గరకి చేరుకున్నాం. బస్ ఎక్కి 6.20కి వాస్కో డ గామా షాపింగ్ సెంటర్‌కి చేరుకున్నాం. పక్కనే చాలా పెద్ద రైల్వే స్టేషన్ ఉంది. దాని ఆవరణలో పార్కింగ్ స్పేస్‌ని మనం ఇండియాలో ఎక్కడా చూడలేం. చాలా స్థలం వదిలారు. మా బస్‌ని కూడా అక్కడే పార్క్ చేసారు.

"సరిగ్గా రెండు గంటలు షాపింగ్‌కి టైం ఇస్తున్నాను. ఇప్పుడు ఆరు ఇరవై ఐంది. ఎనిమిదీ ఇరవైకి మళ్ళీ ఇక్కడికి రావాలి. గుర్తుందిగా. కొత్త వాళ్ళతో మాట్లాడకండి. హేండ్ బేగ్‌ని వెనక్కో, పక్కకో కాక ముందుకి వేసుకోండి. అందులో నీళ్ళ సీసా, ఫుడ్, సెల్ ఫోన్, మందులులాంటివి మాత్రమే పెట్టుకోండి. ముఖ్యంగా పాస్‌పోర్ట్‌లు జాగ్రత్త. చెప్పిన సమయానికి చెప్పిన చోటుకి వస్తే మీ వల్ల ఆలస్యం కాదు" దీపక్ బస్ దిగే ముందు టూరిస్ట్‌లు తీసుకోవాల్సిన సాధారణ జాగ్రత్తలని మరోసారి చెప్పాడు.

క్రిస్టిన్ గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయింది. నేను ఐదు యూరోలు టిప్ ఇస్తే థాంక్స్ చెప్పింది. ఇద్దరు మాత్రమే టిప్ ఇచ్చారు.




పక్కనే ఉన్న వాస్కో డ గామా మాల్‌కి వెళ్ళాం. విశాలమైన ట్రాన్స్‌పరెంట్ రూఫ్ మీద పావురం రెట్టలు చాలా ఉన్నాయి. అన్నీ ఖరీదైన బ్రాండెడ్ వస్తువులే. ఏమీ కొనలేదు. 8.10కి మాల్‌లోంచి బయటకి వచ్చి, ఖాళీ వంతెన మీద రైల్వే స్టేషన్‌లోని మా బస్ పార్క్ చేసిన చోటికి చేరుకున్నాం. దారిలో కిరసనాయిల్ తాడు అంటించి లాఘవంగా తిప్పే ఓ జిప్సీ కనిపిస్తే ఓ యూరో ఇచ్చాను. అంతా వచ్చాక 8.25కి బస్ బయలుదేరి, 8.50కి హోటల్ గణేష్ పేలస్‌కి చేరుకుంది. ఎప్పటిలా జయదేవ్, గుప్తాజీ, మేము కలిసి ఓ బల్ల ముందు కూర్చున్నాం. వాళ్ళిద్దరూ ఒంటరిగా రావడంతో మేమే అన్ని చోట్లా వారి ఫోటోలు తీసాం. డిన్నర్‌లో పత్రా (శెనగపిండిలో ఏదో ఆకు వేసిన బజ్జీ లాంటిది - ఇది గుజరాతీ వంటకం) బంగాళాదుంపల కూర, రోటీ, అన్నం, కిచిడీ, అప్పడం, పుదీనా చట్నీ, తియ్యటి చట్నీ, పెరుగు ఐస్ క్రీం. బీర్ 5 యూరోలు. లక్షల్లో ఖర్చు చేసి ఈ టూర్‌కి వచ్చిన వారిలో కొందరు మంచినీళ్ళు, కోక్ ఉచితంగా ఇచ్చినందుకు సంతోషించారు. గణేష అని పేరు పెట్టారు కానీ దీని యజమానులు పాకిస్తానీస్. విదేశాల్లోని బంగ్లాదేశ్, పాకిస్తానీలు ఇండియన్ రెస్టారెంట్ అనే పేరే పెట్టుకోవడం గమనించాను. 9.30కి బయలుదేరి మా హోటల్‌కి చేరుకున్నాం.

"లిస్బన్ టూర్ ముగిసింది. రేపు ఉదయం ఏడుకి వేకప్ కాల్. ఎనిమిదికి బ్రేక్‌ఫాస్ట్. తొమ్మిదికి హోటల్ ఖాళీ చేసి స్పెయిన్‌లోని సెవిల్‌కి బయల్దేరుతాం" దీపక్ బస్‌లో అందరికీ చెప్పాడు.

మా హోటల్లో ప్రతీ ఫ్లోర్‌కి ఓ థీం ఉంది. మాది కిస్. మా ఫ్లోర్ కారిడార్లోని ఓ ఎర్రటి సోఫా మూసిన పెదవుల ఆకారంలో ఉండి, దానిపైన గోడమీద మూడు ఫోటోలున్నాయి. పెదవులు మాత్రమే ఎర్రగా ఉన్న మార్లిన్ మన్రో బ్లాక్ అండ్ వైట్ ఫోటో, దానికి ఎడమవైపు రెండో ప్రపంచ యుద్ధం ముగిసాక న్యూయార్క్‌లో టైమ్స్ స్క్వేర్‌లో ఓ నర్స్‌ని ఓ యువకుడు ముద్దు పెట్టుకునే దృశ్యం 'ది కిస్' తాలూకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఫొటోలో అతని టోపీ మాత్రమే ఎర్రగా ఉంది. మన్రో

ఫోటోకి కుడి వైపు నేను గుర్తుపట్టలేకపోయిన ఓ చుంబనం ఫోటో ఉంది. మిగతా ఫ్లోర్స్‌కి వెళ్ళి చూస్తే 3నించి 10 ఫ్లోర్స్ దాకా గ్రే, సన్‌రైజ్, సన్‌ఫ్లవర్, వైట్, డార్క్ ఇలా కొన్ని థీమ్స్ ఉన్నాయి. పదో అంతస్థు థీమ్ పింకీ.

గదిలోకి వెళ్ళాక వాట్సప్‌లో కావ్య నించి గాంగోలోని పాయింట్ నోయిర్‌కి చేరుకున్నాననే మెసేజ్ ఉంది. పదిన్నరకి నిద్రపోయాం.

మేము చూడని లిస్బన్‌లోని పర్యాటక ఆకర్షణలు:

***బీర్ మ్యూజియం.***

క్రైస్ట్ కింగ్ విగ్రహం: రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నందుకు చిహ్నంగా క్రైస్ట్ ది కింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. రియో డి జెనీరోలో క్రైస్ట్ ది రిడీమర్ విగ్రహాన్ని చూసిన కార్డినల్ ప్యాట్రియార్క్ ఆఫ్ లిస్బన్ అలాంటిది లిస్బన్‌లో కట్టాలని అనుకున్నాడు. ఆనాటి నియంత సాలజార్ అంగీకారంతో 1949లో శంఖుస్థాపన చేసి 1959కల్లా నిర్మాణం పూర్తి చేసారు. లిస్బన్ వైపు చూస్తూ రెండు చేతులని అడ్డంగా చాపిన 92 అడుగుల ఎత్తు, 92 అడుగుల వెడల్పు గల క్రైస్ట్ విగ్రహం లిస్బన్‌లోని అల్మదా అనే చోట టాగస్ నదికి ఎడమ ఒడ్డున 269 అడుగుల ఎత్తుగల దిమ్మ మీద ఉంది. దీని లోపల లైబ్రరీ, బార్, ఛాపెల్, రెండు హాల్స్ ఉన్నాయి. ఇది 25 ద ఏప్రిల్ బ్రిడ్జ్ మీంచి కనిపిస్తూంటుంది.

పోర్చుగల్‌లోని అగ్వేదా అనే ఊళ్ళో ఆర్ట్ ఫెస్టివల్ జరుగుతుంది. ఆ సమయంలో వీధుల మీద రంగురంగుల గొడుగులని అమరుస్తారు. వీటిని ఫ్లోటింగ్ అంబరెల్లాస్ అంటారు. అవి నీడని ఇవ్వడమే కాక కంటికి ఇంపుగా ఉంటాయి.

సెయింట్ జార్జెస్ కేజిల్: లిస్బన్‌లోని టూరిస్ట్ స్పాట్స్‌లో ఒకటి. కొండమీది ఈ కోటలో యుద్ధ మ్యూజియం ఉంది. క్రిస్టియన్స్ మీద పోరాడిన మూర్స్ (ముస్లిమ్స్) దీన్ని 1147లో నిర్మించారు. అబ్జర్వేషన్ టెర్రేస్ నించి అట్లాంటిక్ ఓషన్, టాగస్ నది, లిస్బన్‌లని చూడచ్చు.

మోడ్రన్ అక్వేరియం: యూరప్‌లోని ప్రసిద్ధి చెందిన ఈ అక్వేరియంలో అనేక జాతుల జలచరాలతో పాటు పక్షులు కూడా ఉన్నాయి.



లిస్బన్ మ్యూజియం: వెస్టర్న్, ఈస్టర్న్ ఆర్ట్ కలెక్షన్.

నేషనల్ మ్యూజియం ఆఫ్ ఏన్షియెంట్ ఆర్ట్: 17వ శతాబ్దపు బిల్డింగ్‌లోని ఇది 15, 16 శతాబ్దాలకి చెందిన చిత్రాల మ్యూజియం.

ఓరియంట్ మ్యూజియం: ఇందులో ఏసియా, ఫార్ ఈస్ట్‌కి చెందినవి ఉంటాయి.

లిస్బోయా స్టోరీ సెంటర్: లిస్బన్ చరిత్రని ఇంటరాక్టివ్ పద్ధతిలో తెలుసుకోవచ్చు.

కార్మో చర్చ్: లిస్బన్‌లోని పురాతన చర్చిల్లో ఇదొకటి.

పోర్చుగల్ రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొనకపోవడంతో, ఇతర యూరోపియన్ నగరాల్లోలా కాక లిస్బన్‌లోని చారిత్రాత్మక కట్టడాలన్నీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*